క్లుప్తంగా...

కార్మికుల పనివేళలు మార్చండి

మల్లాపూర్: ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో జీహెచ్ఎంసీ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు పని వేళలను మధ్యాహ్నం 12 గంటల వరకు మార్చాలని కోరుతూ మంగళవారం మేయర్ ఇన్‌వార్డ్‌లో కాప్రా సర్కిల్ బీఆర్ఎస్ కేవీ అధ్యక్షుడు జి.కుర్మన్న వినతి పత్రం అందజేశారు. ఎండలో ఎక్కువగా ఉండటంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

నేడు శృంగేరిమఠంకు అయోధ్య నుంచి శ్రీరామ పాదుకలు



యాప్రాల్: సైనిక్‌పురి శృంగేరి మఠం, విజయ గణపతి దేవాలయానికి బుధవారం అయోధ్య నుంచి శ్రీరామ పాదుకలకు పంచామృతాభిషేకం, అర్చన, ప్రత్యేక హారతి, పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మాధికారి పండరీనాథ్ తెలిపారు. అయోధ్యలో నిర్మిస్తున్న శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయ గర్భాలయంలో ప్రతిష్ఠించే శ్రీరామపాదుకలకు శృంగేరి శారదా పీఠాధీశ్వరులు జగద్గురువు భారతి తీర్థ మహాస్వామి, జగద్గురు విధుశేఖర భారతి మహాస్వామి ప్రథమ పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై శ్రీరామ పాదుకలను దర్శించుకొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని ఆయన తెలిపారు.

ఒలింపియాడ్ ఐఐటీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

బోడుప్పల్: ఈ అభ్యాస్ అకాడమీ నిర్వహించిన రాష్ట్రస్థాయి గ్లోబల్ ఒలింపియాడ్ ఐఐటీ పోటీ పరీక్షల్లో చెంగిచర్లకు చెందిన విద్యాజ్యోతి విద్యార్థులు ప్రతిభ చాటారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగిన అభ్యాసోత్సవ్-2023 ఇంటర్ స్టేట్ అన్యువల్ అవార్డుల కార్యక్రమంలో ఈ బహుమతులను అందజేశారు. విద్యార్థులు ఎస్.పృథ్వీకుమార్, ఆర్.క్యాతి, లాస్యా, సాయిశ్రీ, పి.శ్రావ్య, ఎస్.వైష్ణవి, భావన, వైధీలీ ప్రతిభ కనబర్చగా పాఠశాల డైరెక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి వారి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులను చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించే విధంగా శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. అభినందించిన వారిలో డైరెక్టర్ అనిల్ అయ్యంగార్, ప్రిన్సిపాల్ నీలిమా ఉన్నారు.

బీజేపీలో పలువురి చేరిక



వసంతను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు

అల్వాల్: రానున్న ఎన్నికలలో బీజేపీ గెలుపునకు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్ రావు అన్నారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో అల్వాల్‌కు చెందిన వి.వసంత బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆమెకు రాంచందర్ రావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు హరీష్‌రెడ్డి, వినయ్ శంకర్, సుజాత తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి



మల్లన్నను కలిసిన సోమశేఖర్‌రెడ్డి

కాప్రా: చర్లపల్లి జైలు నుంచి విడుదలైన తీన్మార్ మల్లన్నను మంగళవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గం బి బ్లాక్ అధ్యక్షుడు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి కలిశారు. గత నెలలో అరెస్ట్ అయ్యి మంగళవారం మల్కాజ్‌గిరి కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో బుధవారం మల్లన్న జైలు నుంచి విడుదలైన సందర్భంగా మల్లన్నను కలిసి మాట్లాడారు. నియంతృత్వ పోకడలతో ముందుకెళ్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతూ జైలుకు పంపుతున్న బీఆర్ఎస్‌కు రోజులు దగ్గర పడ్డాయన్నారు.

హెచ్‌సీఎల్ జిగ్సా 4వ ఎడిషన్ పోటీలు షురూ..

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ హెచ్‌సీఎల్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థుల కోసం నిర్వహించే 4వ హెచ్‌సీఎల్ జిగ్సా పోటీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ప్రాబ్లమ్ సాల్వర్స్ కమ్యూనిటీని నిర్మించే లక్ష్యంతో తీర్చిదిద్దిన ఈ కార్యక్రమం ద్వారా విజేతలకు రూ.12 లక్షల వరకు విలువైన బహుమతులు అందజేస్తామని సంస్థ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు లేదా పాఠశాలలు జూలై 31లోపు https://hcljigsaw.com పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. విజేతలకు బహుమతులతో పాటు హెచ్‌సీఎల్ ఇన్నోవేషన్ ల్యాబ్స్‌లో అభ్యసించే అవకాశం లభిస్తుందని, ప్రతి ఫైనలిస్ట్‌కూ రూ.15 వేల విలువైన బహుమతి అందజేస్తామని వివరించారు.

కొత్త ఓటరుకు ఆహ్వానం

ఓటు నమోదుకు మరోసారి అవకాశం

- అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండితే అర్హులు
- జిల్లాలో ప్రస్తుతం మొత్తం ఓటర్లు 25.24 లక్షలు
- మార్పులు, సవరణలు, తొలగింపుల ప్రక్రియ



పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవడానికి మరోసారి అవకాశం వచ్చింది. ఏటా జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటు కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పిస్తోంది. ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతున్నా.. ఈ నెల 1వ తేదీ నుంచి వాటిని ఇంటర్నెట్‌లో నిక్షిప్తం చేసే ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. నూతన ఓటు నమోదుతో పాటు పేరులో మార్పులు, సవరణలు, ఓటు తొలగింపునకు సైతం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశముంది.

–సాక్షి, మేడ్చల్ జిల్లా

అందుబాటులోకి నూతన వెబ్‌సైట్..

ఓటు నమోదు నుంచి వివిధ ప్రక్రియలను ఇంటర్నెట్‌లో నిక్షిప్తం చేసేందుకు పాత వెబ్‌సైట్ స్థానంలో ఎన్నికల సంఘం కొత్త వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుతం ఈ వెబ్‌సైట్‌లోనే నియోజకవర్గ కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల ఎన్నికల సిబ్బంది ఫారం-6, 7, 8 తదితర దరఖాస్తులను నిక్షిప్తం చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాను పరిశీలించి తమ ఓటులోని వివరాలు పరిశీలించుకోవాలని.. అందులో ఏమైనా తప్పులుంటే సంబంధిత దరఖాస్తు ఫారం ద్వారా మీ సేవ కేంద్రం, మై ఓటర్ యాప్, ఈసీఐ వెబ్‌సైట్‌లో ఎక్కడైనా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ఫారం-8లో కొత్త ఆప్షన్..

నూతన ఓటు నమోదుకు ఫారం 6, ఓటు తొలగింపునకు ఫారం-7, సవరణలకు ఫారం-8తో దరఖాస్తు చేసుకోవాలి. ఫారం-8లో గతంలో ఒకే నియోజకవర్గంలో మాత్రమే పోలింగ్ కేంద్రం మార్పునకు అవకాశం ఉంది. ప్రస్తుతం ఏ నియోజకవర్గానికైనా మార్చుకునే వెసులుబాటు కల్పించారు. దీంతో పాటు ఓటరు కార్డు పోయినా, ధ్వంసమైనా సంబంధిత ఎపిక్ సంఖ్యతో నూతన కార్డు కోసం ఫారం-8లో ఆప్షన్ ఇచ్చారు. దివ్యాంగులు తమకు ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రంలో మూడు చక్రాల కుర్చీ ఏర్పాటుకు సైతం ఫారం-8 కొత్త ఆప్షన్ ఇచ్చారు.

ముమ్మరంగా క్షేత్రస్థాయి పరిశీలన..

ఓటు నమోదు, సవరణ, తొలగింపులకు ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులు చెక్ లిస్టులను సిద్ధం చేసిన ఎన్నికల సిబ్బంది వాటిని బీఎల్‌వోలకు అందిస్తున్నారు. ఆయా చెక్ లిస్టుల ఆధారంగా బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన సంబంధిత ధ్రువపత్రాలను తనిఖీ చేసి యాక్సెప్ట్ లేదా రిజెక్ట్ చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఈ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది.

నియోజకవర్గాల వారీగా ప్రస్తుత ఓటర్ల వివరాలు ఇలా ఉన్నాయి.

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
మేడ్చల్	2,85,957	2,67,786	42	5,53,785
మల్కాజిగిరి	2,23,357	2,18,693	03	4,42,053
కుత్బుల్లాపూర్	3,22,566	2,90,010	124	6,12,700
కూకట్‌పల్లి	2,24,070	2,02,276	119	4,26,465
ఉప్పల్	2,55,386	2,34,528	34	4,89,948
మొత్తం	13,11,336	12,13,293	322	25,24,951

డ్రైనేజీ సాఫీగా వెళ్లేందుకు కొత్త లైన్ వేస్తాం



సాయినగర్ కాలనీలో డ్రైనేజీని పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని సాయినగర్ కాలనీలో భూగర్భ డ్రైనేజీ సమస్యపై స్థానికుల ఫిర్యాదు మేరకు మంగళవారం జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ పర్యటించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. డ్రైనేజీ సాఫీగా వెళ్లేందుకు డ్రైనేజీ లైన్‌ను ఏర్పాటు చేస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ సందీప్, డివిజన్ అధ్యక్షుడు మేకల ముత్యంరెడ్డి, కాలనీవాసులు శ్రీనివాస్, రఫీక్, శ్రీశైలం, రాజయ్య, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

మల్లాపూర్: ఆటో మోటార్ రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ బోయిన్‌పల్లి వినోద్‌కుమార్‌కు ఆటో మోటార్ రవాణా రంగం రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య వినతి పత్రం అందజేశారు. సంక్షేమ బోర్డు విషయంపై ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని వారికి హామీ ఇచ్చినట్లు తెలిపారు. వినోద్‌కుమార్‌ను కలిసిన వారిలో బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణ, కార్మిక విభాగం నాయకులు రమణారెడ్డి, వ్యాన్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సాయికుమార్ తదితరులు ఉన్నారు.



వినోద్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న వేముల మారయ్య

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 2 లక్షల ఉద్యోగాలు



ఇందిరానెహ్రూనగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్

గౌతంనగర్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే నిరుద్యోగ యువతకు 2 లక్షల ఉద్యోగాలు, రూ.500 వందలకే గ్యాస్ సిలిండర్, అర్హులైన పేదలకు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల సాయం అందిస్తామని కాంగ్రెస్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఇన్‌చార్జి నందికంటి శ్రీధర్ అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా మంగళవారం గౌతంనగర్ డివిజన్ పరిధిలోని ఇందిరానెహ్రూనగర్‌లో ఆయన పార్టీ శ్రేణులతో కలిసి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా గడప గడపకు తిరుగుతూ ప్రజలను అడిగి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. డ్రైనేజీ, తాగునీరు, ముఖ్యంగా దోమల బెడద విపరీతంగా ఉందని ప్రజలు వివరించారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బి బ్లాక్ అధ్యక్షుడు టి.వెంకటేష్‌యాదవ్, నాయకులు గుత్తి రాంచందర్, జీవన్‌రెడ్డి, వంశీ ముదిరాజ్, షేక్, ఫరీద్, యాదగిరి, భరత్, ప్రవీణ్, రాము, ఉమేష్‌సింగ్, రెబ్బ వాసు, ఆశ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మేకల సునీతయాదవ్

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నామని స్థానిక కార్పొరేటర్ మేకల సునీత యాదవ్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని ఉత్తంనగర్‌లో రూ.20 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అభివృద్ధి నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. నిర్ణీత సమయానికి పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో డీఈ లౌక్య, ఏఈ దివ్యజ్యోతి, బీఆర్ఎస్ నాయకులు మేకల రాముయాదవ్, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ నరేందర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

అల్వాల్: అనుమానస్పద స్థితిలో వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీస్ స్టేషన్ పరిధిలోని సాయిరెడ్డినగర్‌లో నివాసముండే ఎల్లయ్య(30) వంట మనిషి. సోమవారం రాత్రి ఇంటికి వచ్చిన ఎల్లయ్య మంగళవారం ఉదయం బయటకు రాకపోవడంతో ఇంటి యజమాని గోపికి అనుమానం వచ్చి తలుపులు తెరిచి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.











ఉప్పల్‌లో క్రికెట్ అభిమానుల సందడి

ఉప్పల్: ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం పరిసర ప్రాంతాలు అభిమానుల కోలాహలంతో కిక్కిరిసిపోయాయి. మంగళవారం ఉప్పల్‌లో హైదరాబాద్ సన్ రైజర్స్, ముంబై ఇండియన్స్ జట్ల మధ్య జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌కు అభిమానులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సాయంత్రం ఉక్కపోతను సైతం లెక్క చేయకుండా క్రికెట్‌ను ఎంజాయ్ చేసేందుకు వచ్చారు.

భారీ బందోబస్తు..

ఒక్కరోజు ముందు నుంచే పోలీసులు స్టేడియాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. పరిసర ప్రాంతాలతో పాటు పార్కింగ్ ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ గోవింద్‌రెడ్డి తెలిపారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పార్థసారథి తెలిపారు.



వైభవంగా రుద్రహోమం

గౌతంనగర్: మాసశివరాత్రిని పురస్కరించుకొని ఉత్తంనగర్ దుర్గా జ్యోతి షాలయంలో మంగళవారం రుద్రహోమం, శివుడికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు మూగు నాగరాజుశర్మ, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అన్ని డివిజన్లలో చలివేంద్రాలను ఏర్పాటు చేశాం



ఉప్పల్ చౌరస్తాలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు

ఉప్పల్: ప్రయాణికుల సౌకర్యార్థం మధురా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉప్పల్ రింగ్ రోడ్డులో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ట్రస్టు చైర్మన్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. నిత్యం వేలాది మంది ప్రయాణికులు రాష్ట్రం నలుమూలల నుంచి ఉప్పల్‌కు వస్తారని, వారి సౌకర్యార్థం వేసవిలో దాహార్తి తీర్చడానికి ప్రతి సంవత్సరం ఉప్పల్ చౌరస్తాలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దాదాపు నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లలో చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటితో పాటు ట్రస్టు ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. పాఠశాలలను దత్తత తీసుకుని పేద విద్యార్థులకు చేయూత ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలకల నరసింహారెడ్డి, మేడ్చల్ జిల్లా మైనార్టీ చైర్మన్ అబ్దుల్ రషీద్, ఆశు, జిల్లా ఎస్టీ సెల్ చైర్మన్ గణేష్ నాయక్, వంజరి సంతోష్ కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌రెడ్డికి జీవిత సాఫల్య పురస్కారం

బోడుప్పల్: బోడుప్పల్ లోటస్‌ల్యాప్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డికి జీవిత సాఫల్య పురస్కార్ అవార్డు లభించింది. రవీంద్ర భారతిలో జరిగిన ఈ అభ్యాస్ కార్యక్రమంలో శాంత బయోటెక్నిక్ చైర్మన్ పద్మభూషణ్ వరప్రసాద్‌రెడ్డి చేతులమీదుగా ఈ అవార్డును గోపాల్‌రెడ్డి అందుకున్నారు. మంగళవారం బోడుప్పల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 30 ఏళ్ల విద్యారంగంలో విద్యార్థులకు విద్య అందిస్తూ వారి అభ్యున్నతికి ఎంతో కృషి చేసినట్లు వెల్లడించారు. తనకు ఈ పురస్కార అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందని, ఈ పురస్కారంతో తనకు మరింత బాధ్యత పెరిగిందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనను అభినందించారు.



జీవిత సాఫల్య పురస్కారం అందుకుంటున్న గోపాల్‌రెడ్డి

టెలిఫోన్ కాలనీ నూతన కమిటీ ఎన్నిక



ప్రభాకర్‌రెడ్డికి బాధ్యతలు అప్పగిస్తున్న ఎన్నికల కమిటీ సభ్యులు

బోడుప్పల్: టెలిఫోన్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నికైంది. గౌరవ అధ్యక్షుడిగా సామల బుచ్చిరెడ్డి, అధ్యక్షుడిగా ఎ.ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రమేష్‌గౌడ్, కోశాధికారిగా కె.బాలనర్సింహ, ఉపాధ్యక్షులుగా మహేందర్, ధీరజ్‌రెడ్డి, సురేందర్, వెంకటేశ్, సలహాదారులుగా దానయ్య, ప్రతాప్‌రెడ్డి, బాలరాజు, శేఖర్, రాంచందర్, సంయుక్త కార్యదర్శులుగా శ్రీనివాస్‌రెడ్డి, శంకర్‌నాయక్, మనోహర్‌రెడ్డి, బాలయ్య, సహాయ కోశాధికారిగా రమేష్, ప్రచార కార్యదర్శులుగా రాజశేఖర్‌రెడ్డి, ధర్మేందర్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, హఫీజ్, వెంకన్న, రాజశేఖర్, శ్రీనివాస్ ఎన్నికయ్యారు. అనంతరం ఎన్నికల కమిటీ సభ్యులు వారిచే ప్రమాణ స్వీకారం చేయించి బాధ్యతలు అప్పగించారు.

వెంటనే ప్రణాళికలు సిద్ధం చేయండి

– కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి

అల్వాల్: అల్వాల్ డివిజన్‌లో మురుగు, వరద నీటి సమస్య పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించాలని స్థానిక కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం అల్వాల్ డివిజన్ పరిధిలోని బండబస్తీ, పాత అల్వాల్ తదితర ప్రాంతాల్లో జలమండలి అధికారులతో కలిసి ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న మురుగు నీరు, వర్షపు నీటి సమస్యను గుర్తించారు. సమస్య పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ మల్లికార్జున్, శేఖర్, రామారావు, అరవింద్, నాగన్న, కవిత తదితరులు పాల్గొన్నారు.



బండబస్తీలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి

విద్యార్థిని పట్ల ఆటో డ్రైవర్ అసభ్య ప్రవర్తన

– దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగింత

కుషాయిగూడ: విద్యార్థిని పట్ల ఓ ఆటో డ్రైవర్ అసభ్యంగా ప్రవర్తించాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆటో డ్రైవర్‌కు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన ఘటన మంగళవారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. టీచర్స్‌కాలనీకి చెందిన ఓ విద్యార్థిని స్థానిక ఓ కార్పొరేట్ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. శివసాయినగర్ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ యాకయ్య ఆ విద్యార్థినితో పాటు మరో ముగ్గురిని రోజూ ఆటోలో స్కూల్‌కు తీసుకెళ్లి తీసుకువస్తాడు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం 1 గంటకు స్కూల్ వదిలిన తర్వాత అందరినీ ఆటోలో ఎక్కించుకొని బయలుదేరాడు. మిగతా ముగ్గురిని వారి ఇళ్ల వద్ద వదిలి ఆ విద్యార్థినిని ఇంటికి తీసుకెళ్లకుండా వేరే చోటికి తీసుకెళ్లాడు. మధ్యాహ్నం 1:20 గంటల వరకు ఇంటికి చేరుకునే కూతురు 1:30 గంటల వరకు రాకపోవడంతో తండ్రి ఆటో డ్రైవర్‌కు ఫోన్ చేశాడు. ఫోన్ లిఫ్ట్ చేసిన ఆటో డ్రైవర్ మిగతా పిల్లలను వదులుతున్నాను సార్.. మా ఇంటికి వెళ్లే క్రమంలో మీ పాపను వదిలి వెళ్తానని సమాధానం చెప్పి పది నిమిషాల్లో ఆమెను ఇంటి వద్ద వదిలి వెళ్లాడు. ఇంట్లోకి వెళ్లిన విద్యార్థిని ఆటో డ్రైవర్ తనను ఇంటికి తీసుకురాకుండా మరో చోటికి తీసుకెళ్లి నా పట్ల అసభ్యంగా వ్యవహరించాడని తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో తండ్రి ఆటో డ్రైవర్‌కు ఫోన్ చేసి ఇంటికి పిలిచాడు. జరిగిన విషయంపై నిలదీసి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించాడు.

కెరీర్‌పై యువత దృష్టి సారించాలి

ఉప్పల్: దేశ అవసరాల మేరకు యువత తమ కెరీర్‌ను నిర్మించుకోవాలని ఇండిపెండెంట్ సైంటిస్టు శ్రీనివాస్ తెలిపారు. దేశవ్యాప్తంగా 2015 నుంచి ఇప్పటి వరకు తన బైక్‌పై 2,18,025 కిలో మీటర్లు పర్యటించినట్లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఉప్పల్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన తన అనుభవాలను పంచుకున్నారు. దేశాభివృద్ధి కోసం యువత ఉత్పాదక రంగం వైపు దృష్టి సారించాలని అన్నారు. తన ప్రయాణంలో మేక్ ఇన్ ఇండియా, ఆత్మ నిర్భర్ భారత్‌పై యువతకు మార్గదర్శకత, సామాజిక- ఆర్థిక ఆలోచనా ప్రక్రియపై దృష్టి సారించడం, దేశాభివృద్ధికి తోడ్పడే టెక్నాలజీ పెంచుకోవడం, ఇన్నోవేషన్, డిజైనింగ్ తదితర రంగాల్లో ఆసక్తి పెంచుకోవాలని యువతకు సూచించినట్లు తెలిపారు. తన ప్రయాణ కాలంలో యువతకు ఎంతో మేలు జరిగిందని ఆయన అన్నారు.



సైంటిస్టు శ్రీనివాస్